




జాతీయ తెలుగు దినపత్రిక
RNI - TGTEL/25/A0348

# సందేశ్ టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు








| శనివారం 21 మార్చి 2026 | పేజీలు : 04 | వెల - రూ 2/- | సంపుటి : 01 సంచిక : 292 | ప్రచురణ : తెలంగాణ & ఆంధ్రప్రదేశ్ | ఎడిటర్ : శెట్టి వెంకటేష్ |
|---|---|---|---|---|---|




## భారత సైన్యంలో నియామకానికి ఆన్‌లైన్ దరఖాస్తులు ప్రారంభం – నియామక సంవత్సరం 2027

సందేశం టైమ్స్, సికింద్రాబాద్, మార్చి 21, ప్రతినిధి: భారత సైన్యంలో వివిధ కేటగిరీలలో నియామకానికి సంబంధించి అభ్యర్థుల నుండి ఆన్‌లైన్ నమోదు, దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైంది. అగ్నివీర్ కేటగిరీల్లో అవివాహిత యువత కోసం నియామక నోటిఫికేషన్ ఫిబ్రవరి 13, 2026న అధికారిక వెబ్‌సైట్‌లో విడుదల చేయగా, సికింద్రాబాద్ ఆర్మీ రిక్రూటింగ్ కార్యాలయం పరిధిలోని తెలంగాణ రాష్ట్రంలోని 33 జిల్లాల అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానించబడుతున్నాయి. ఆదిలాబాద్ నుండి యాదాద్రి భువనగిరి వరకు అన్ని జిల్లాలకు చెందిన యువతకు ఈ అవకాశం కల్పించబడింది. అగ్నివీర్ జనరల్ డ్యూటీ, అగ్నివీర్ టెక్నికల్, అగ్నివీర్ క్లర్క్/స్టోర్ కీపర్ టెక్నికల్, అగ్నివీర్ ట్రేడ్స్‌మన్ (10వ తరగతి), అగ్నివీర్ ట్రేడ్స్‌మన్ (8వ తరగతి) వంటి విభాగాల్లో నియామకాలు జరుగుతాయి. అభ్యర్థులు తమ అర్హతల ఆధారంగా ఏ రెండు కేటగిరీలకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. అగ్నివీర్ కేటగిరీలకు గరిష్ట వయోపరిమితిని 21 సంవత్సరాల నుండి 22 సంవత్సరాలకు పెంచారు. ఆన్‌లైన్ కామన్ ఎంట్రన్స్ పరీక్షను తెలుగు సహా 13 భాషల్లో నిర్వహించనున్నారు. ఐటీఐ, డిప్లొమా, ఎన్‌సీసీ అర్హతలు ఉన్న అభ్యర్థులకు అదనపు మార్కులు కల్పించబడతాయి. దరఖాస్తులు అధికారిక వెబ్‌సైట్ ద్వారానే సమర్పించాలి. దరఖాస్తుల సమర్పణకు చివరి తేదీ ఏప్రిల్ 1, 2026 కాగా, ఆన్‌లైన్ పరీక్ష తాత్కాలికంగా జూన్ 1 నుండి జూన్ 15, 2026 వరకు నిర్వహించనున్నారు. అభ్యర్థులు తమ అడ్మిట్ కార్డులను అదే వెబ్‌సైట్ నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. తాజా సమాచారం కోసం అభ్యర్థులు వెబ్‌సైట్‌ను తరచూ పరిశీలించడంతో పాటు తమ ఈ-మెయిల్ ఖాతాలను చెక్ చేయాలని అధికారులు సూచించారు. మరిన్ని వివరాల కోసం సికింద్రాబాద్ ఆర్మీ రిక్రూటింగ్ కార్యాలయాన్ని సంప్రదించవచ్చని తెలిపారు. నియామక ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా, నిష్పక్షపాతంగా జరుగుతుందని, మధ్యవర్తులు లేదా మోసగాళ్ల మాటలు నమ్మవద్దని హెచ్చరించారు. కేవలం ప్రతిభ ఆధారంగా మాత్రమే ఎంపిక జరుగుతుందని స్పష్టం చేశారు.




## 2027 జనాభా లెక్కలు దేశాభివృద్ధికి కీలకం

సందేశం టైమ్స్, సూర్యాపేట, మార్చి 21, ప్రతినిధి: 2027 జనాభా లెక్కలు దేశ అభివృద్ధికి, ప్రభుత్వ పథకాల సమర్థ అమలుకు కీలకమని జిల్లా కలెక్టర్, ప్రధాన జనాభా గణన అధికారి తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు. అధికారులు పూర్తి అవగాహనతో క్షేత్రస్థాయిలో బాధ్యతగా పనిచేసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన సూచించారు. జిల్లాలో జనాభా గణన-2027ను సమర్థవంతంగా నిర్వహించేందుకు జిల్లా, మండల, మున్సిపల్ స్థాయి సెక్షన్ క్లార్కులు మరియు టెక్నికల్ అసిస్టెంట్లకు మార్చి 20, 22, 23 తేదీలలో మూడు రోజుల పాటు ఇళ్ల జాబితా, గృహ గణన శిక్షణ కార్యక్రమాన్ని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనాభా గణన నిర్వహణకు అవసరమైన విధి విధానాలు, మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలన్నారు. జనాభా గణన రెండు దశల్లో జరుగుతుందని తెలిపారు. మొదటి దశగా ఇళ్ల జాబితా మరియు గృహ గణన మే 11 నుంచి జూన్ 9, 2026 వరకు నిర్వహించబడుతుందని, రెండో దశగా జనాభా గణన 2027 ఫిబ్రవరిలో నిర్వహిస్తారని పేర్కొన్నారు. మార్చి 1, 2027ను సూచన తేదీగా పరిగణిస్తారని తెలిపారు. జనాభా గణన ద్వారా లభించే గణాంకాలు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, మౌలిక సదుపాయాల ప్రణాళికలకు ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. ఈసారి జనాభా గణనను దేశంలో తొలిసారిగా డిజిటల్ విధానంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. మొబైల్ అనువర్తనాలు, వెబ్ పోర్టల్ ద్వారా గణన చేపడతారని, ప్రజలు స్వయంగా తమ వివరాలను ఆన్లైన్లో నమోదు చేసుకునే అవకాశం కల్పించనున్నట్లు వెల్లడించారు. మొదటి దశలో ఇళ్ల జాబితా, గృహ గణన సందర్భంగా ఇంటి నిర్మాణం, పరిస్థితి, కుటుంబ యజమాని వివరాలు, తాగునీరు, మురుగు పారుదల, మరుగుదొడ్లు, వంటగది వంటి సౌకర్యాలతో పాటు రేడియో, దూరదర్శిని, స్మార్ట్ ఫోన్, కంప్యూటర్, సైకిల్, కారు వంటి గృహ సౌకర్యాలకు సంబంధించిన మొత్తం 34 ప్రశ్నలపై ఎన్యుమరేటర్లు ప్రతి ఇంటికి వెళ్లి వివరాలు సేకరిస్తారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ కె. సీతారామారావు, సీపీఓ కిషన్ మాట్లాడుతూ అన్ని శాఖల సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలిపారు. జనాభా గణాంక అధికారి రవీంద్ర నాయక్ మండలాల వారీగా గణన బ్లాకుల విభజన, గణన విధానం పై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా గణాంక అధికారి వి. రామారావు, ఉప గణాంక అధికారి ఎం. రాజేష్, బి. కోటేశ్వరరావు, పర్యవేక్షకులు దున్న శ్యామ్, మండల ప్రణాళికా గణాంక అధికారులు, టెక్నికల్ అసిస్టెంట్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## తిరుపతిలో సీఎం చంద్రబాబు రెండు రోజుల పర్యటన ప్రారంభం: భక్తులకు అన్నప్రసాదం స్వయంగా వడ్డిస్తారు, కొత్త ఫుడ్ ల్యాబ్ ప్రారంభం

సందేశం టైమ్స్, తిరుపతి, మార్చి 21, ప్రతినిధి: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రెండు రోజుల పర్యటన కోసం తిరుపతికి చేరుకున్నారు. ఆయనకు జిల్లా ఇంచార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్, టీటీడీ ఈఓ ఎం. రవిచంద్ర, ఎమ్మెల్యే పులివర్తి నాని, ఎంపీ డి. ప్రసాదరావు తదితరులు స్వాగతం పలికారు. ఈ రాత్రి తిరుమలలో బస చేపట్టనున్న సీఎం, మనుమడు నారా దేవాన్ష్ పుట్టినరోజు సందర్భంగా రేపు కుటుంబ సమేతంగా శ్రీవారి దర్శనం నిర్వర్తించనున్నారు. ఉదయం తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద కాంప్లెక్సులో భక్తులకు అన్నప్రసాదం వితరణ చేస్తూ రూ.44 లక్షల విరాళాన్ని అందజేయనున్న ముఖ్యమంత్రి కుటుంబం. ఇప్పటికే 12 సార్లు శ్రీవేంకటేశ్వర అన్నప్రసాద ట్రస్టుకు విరాళం అందించిన చంద్రబాబు, స్వయంగా భక్తులకు వడ్డించి అనంతరం ముఖాముఖి సమావేశంలో భక్తులతో మాట్లాడనున్నారు. రేపు ఉదయం 10 గంటలకు తిరుమల ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్, తదుపరి స్టేట్ ఫుడ్ ల్యాబొరేటరీ, ఎఫ్ఎస్ఎస్ఏఐ సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఆహార పదార్థాల విశ్లేషణా ల్యాబ్ ప్రారంభం అవుతుంది.



## తెలంగాణ బడ్జెట్ 2026-27లో పలు సంక్షేమ పథకాలు ప్రకటించిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

సందేశం టైమ్స్, హైదరాబాద్, మార్చి 21, ప్రతినిధి: తెలంగాణ రాష్ట్ర బడ్జెట్ 2026-27ను అసెంబ్లీలో ప్రవేశపెడుతూ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పలు కీలక సంక్షేమ పథకాలను ప్రకటించారు. రాష్ట్రంలోని కోటి 15 లక్షల కుటుంబాలకు ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా కల్పించే "ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా" పథకాన్ని జూన్ 2 నుంచి అమలు చేయనున్నట్లు తెలిపారు. చేయుత పథకం ద్వారా అర్హులైన వారికి రెండు లక్షల కొత్త పెన్షన్లు మంజూరు చేయనున్నట్లు ప్రకటించారు. షెడ్యూల్ తెగల అభివృద్ధి కోసం రూ.12,600 కోట్లతో "ఇందిరా సౌర గిరిజన వికాసం" పథకాన్ని అమలు చేస్తూ 100 శాతం సబ్సిడీతో సోలార్ పంపుసెట్లు అందించనున్నట్లు తెలిపారు. ఆరు లక్షల ఎకరాల పోడు భూముల్లో తోటల పెంపకాన్ని ప్రోత్సహించి సుమారు రెండు లక్షల పది వేల గిరిజన రైతులకు లాభం చేకూర్చనున్నట్లు పేర్కొన్నారు. మొత్తం రూ.3,24,234 కోట్ల బడ్జెట్‌ను ప్రవేశపెట్టగా, విద్యా శాఖకు రూ.26,674 కోట్లు, వైద్య ఆరోగ్య శాఖకు రూ.13,679 కోట్లు, విద్యుత్ శాఖకు రూ.21,285 కోట్లు, వ్యవసాయం-రైతు సంక్షేమానికి రూ.23,179 కోట్లు కేటాయించారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధికి రూ.33,688 కోట్లు, నీటిపారుదలకు రూ.22,615 కోట్లు, గృహ నిర్మాణానికి రూ.7,430 కోట్లు, మహిళా శిశు సంక్షేమానికి రూ.3,143 కోట్లు కేటాయించారు. ఐటీ శాఖకు రూ.875 కోట్లు, పరిశ్రమలకు రూ.3,490 కోట్లు, పర్యాటకానికి రూ.1,224 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. విద్యా రంగంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటు చేసి ఆధునిక సదుపాయాలతో అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం విస్తరణతో పాటు దివ్యాంగ విద్యార్థులకు మోటరైజ్డ్ వాహనాలు అందించనున్నట్లు వెల్లడించారు. పాలిటెక్నిక్ కళాశాలలో 15 కొత్త కోర్సులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఆరోగ్య రంగంలో రాష్ట్ర ప్రజలందరికీ డిజిటల్ హెల్త్ కార్డులు అందించడంతో పాటు ఆసుపత్రుల విస్తరణ ద్వారా వేలాది పడకలను అందుబాటులోకి తెస్తామని చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల కోసం నగదు రహిత ఆరోగ్య భద్రత పథకాన్ని అమలు చేస్తామని వెల్లడించారు. ఇదే సమయంలో కొత్తగా నియమితులైన రాష్ట్ర ప్రభుత్వ విప్‌లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.

## తెలంగాణ 2026-27 బడ్జెట్: రైతు సంక్షేమం, మహిళల సాధికారత, విద్య, ఆరోగ్యం, ఉపాధి,

### మౌలిక వసతుల అభివృద్ధికి రూ.3,24,234 కోట్లు కేటాయింపు





సందేశం టైమ్స్, హైదరాబాద్, మార్చి 21, ప్రతినిధి:తెలంగాణ ప్రభుత్వం 2026-27 ఆర్థిక సంవత్సరానికి రూ.3,24,234 కోట్ల వ్యయంతో ప్రతిపాదించిన వార్షిక బడ్జెట్‌ను ప్రజాసమక్షంలో ఉంచింది. ముఖ్యమంత్రి శ్రీ ఎ.రేవంత్ రెడ్డి అధ్యక్షతన శాసనసభలో మంత్రిమండలి సమావేశంలో ఆమోదం పొందిన ఈ బడ్జెట్ పేద, మధ్య తరగతి, ధనిక అన్న తేడా లేకుండా ప్రతి పౌరుడికి సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం అందించే విధంగా రూపొందించబడింది. డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ వారి "ప్రతి పౌరుడికి న్యాయం" సిద్ధాంతాన్ని అనుసరించి, పాలకులుగా కాకుండా సేవకులుగా పరిపాలన కొనసాగిస్తున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది.ఈ బడ్జెట్‌లో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా, విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్ మరియు మధ్యాహ్న భోజన పథకాలు, పాలిటెక్నిక్ కాలేజీలను ఆధునిక టెక్నాలజీ సెంటర్లుగా మారుస్తూ 15 కొత్త కోర్సులను ప్రారంభించడం, మహిళా శక్తి మిషన్, రైతు భరోసా పథకం, గృహజ్యోతి, చేయూత, మహాలక్ష్మి వంటి సంక్షేమ పథకాలకు ప్రత్యేక కేటాయింపులు ఉన్నాయి.రాష్ట్రంలో 1 కోటి 15 లక్షల కుటుంబాలకు ప్రతి కుటుంబానికి 5 లక్షల రూపాయల జీవిత బీమా అందించే ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం, ప్రీ-ప్రైమరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్యార్థులకు నాణ్యమైన బ్రేక్‌ఫాస్ట్ పథకం, ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం తదితర ప్రతిపాదనలు బడ్జెట్‌లో ఉన్నాయి. పాలిటెక్నిక్ విద్యార్థులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తూ ప్రతి నెల రూ.2,000 స్కాలర్‌షిప్ ఇవ్వడం కూడా ఇందులో భాగం.రాష్ట్రంలోని 57 పాలిటెక్నిక్ కాలేజీలను అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్లుగా మార్చడం, 30 వేల ఏకరాల్లో భారత్ ఫ్యూచర్ సిటీ నిర్మాణం, మచిలీపట్నం పోర్టుకు గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి, టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, రీసెర్చ్ & డెవలప్‌మెంట్, స్టార్టప్ మరియు ఫైనాన్షియల్ సర్వీస్ సెక్టార్లకు ఆధునిక కేంద్రాలుగా అభివృద్ధి చేయడం, రోడ్లు, భవనాలు, నగరాభివృద్ధి, విద్యుత్, పౌరసరఫరాలు, వైద్య, ఆరోగ్య, సాగునీటి ప్రాజెక్టులలో విస్తృతంగా నిధులు కేటాయించడం ఈ బడ్జెట్ ముఖ్య లక్ష్యాలు.రైతు సంక్షేమం కోసం రైతు భరోసా పథకం ద్వారా ప్రతి ఎకరాకు రూ.12,000 (రెండు పంటలకు కలిపి) సహాయం, పౌర సరఫరా శాఖకు రూ.7,366 కోట్లు, విద్యుత్ రంగానికి రూ.21,285 కోట్లు, విద్యా రంగానికి రూ.26,674 కోట్లు, వైద్య, ఆరోగ్య రంగానికి రూ.13,679 కోట్లు, సాగునీటి ప్రాజెక్టులకు రూ.22,615 కోట్లు, రోడ్లు, భవనాల శాఖకు రూ.12,789 కోట్లు, పురపాలక, పట్టణాభివృద్ధికి రూ.17,907 కోట్లు, హోం శాఖకు రూ.11,907 కోట్లు కేటాయించబడ్డాయి.ప్రభుత్వం ప్రతిపాదించిన బడ్జెట్ ద్వారా తెలంగాణను సుస్థిర అభివృద్ధి వైపుకు నడిపించడం, మహిళల సాధికారత, యువతకు ఉపాధి అవకాశాలు, నైపుణ్యవంతమైన విద్య, ఆరోగ్యం, విద్యార్థులకు పోషకాహారం, మౌలిక వసతుల అభివృద్ధి వంటి అంశాల్లో దృఢమైన మార్గదర్శకత్వం కల్పించనుంది. ఆర్థిక మంత్రి ప్రకటన ప్రకారం, "తెలంగాణ ప్రజల ఆశలను నిజం చేసే సంకల్పపత్రమే ఈ బడ్జెట్. పేదవాడి కన్నీరు తుచిన నాడే నిజమైన అభివృద్ధి" అని ప్రకటించారు.ఈ బడ్జెట్ రాష్ట్ర సమగ్రాభివృద్ధికి, రైతులు, విద్యార్థులు, మహిళలు, యువతకు నేరుగా లబ్ధి చేకూర్చేలా రూపొందించబడినది.






# వట్పల్లి పోలీస్ స్టేషన్ స్థలాల పరిశీలన: మండల నాయకులు, అధికారులతో సమీక్ష

సందేశం టైమ్స్, సంగారెడ్డి, మార్చి 21, ప్రతినిధి: బి రమేష్ బాబు
అందోల్ నియోజకవర్గంలోని వట్పల్లి మండల పరిధిలోని పోలీస్ స్టేషన్ కోసం స్థానిక స్థలాల పరిశీలన శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రివర్యులు దామోదర్ రాజనర్సింహ గారి వ్యక్తిగత సహాయకులు హనుమాన్ల ఆధ్వర్యంలో పరిశీలన జరిగింది. పరిశీలనలో జోగిపేట్ సిఐ అనిల్ కుమార్, వట్పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీమతి కొప్పుల లక్ష్మి శేషారెడ్డి, మార్కెట్ కార్యదర్శి సునీల్, ఆత్మ కమిటీ చైర్మన్ కచ్చుర్ రావు, వట్పల్లి ఎస్సై లవకుమార్, అల్లాదుర్గం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొప్పుల శేషారెడ్డి, వట్పల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ప్రతాప్ రమేష్, వట్పల్లి సర్పంచ్ రవీందర్, మాజీ జడ్పీటీసీ సభ్యులు జనయ్యా, విఠల్, యువజన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వెంకట్, డైరెక్టర్లు దిగంబరావ్, హబీబ్, నాగయ్య, సోషల్ మీడియా కోఆర్డినేటర్ జైపాల్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.పరిశీలన సందర్భంగా పోలీస్ స్టేషన్ నిర్మాణానికి, భవిష్యత్తులో సౌకర్యాలు మెరుగుపర్చడానికి అవసరమైన స్థలాల సమీక్ష జరిపి, అన్ని అవసరాలను గుర్తించడం జరిగింది. స్థానిక నాయకులు, అధికారులు సమావేశంలో చర్చలు జరిపి, సమగ్ర అభివృద్ధి, పోలీస్ సౌకర్యాల విస్తరణకు ప్రణాళికలు సిద్ధం చేశారు.




# పరీక్ష కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్లు తీసుకురావద్దు జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య

సందేశం టైమ్స్, సంగారెడ్డి, మార్చి 21, ప్రతినిధి: కె. సంగమేశ్వర్
జిల్లాలో కొనసాగుతున్న పదవ తరగతి పరీక్షల సందర్భంలో, పరీక్ష కేంద్రాల్లోకి ఎవరూ మొబైల్ ఫోన్లు తీసుకురావద్దు అని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య స్పష్టం చేశారు. పరీక్షలు పారదర్శకంగా, కట్టుదిట్టంగా నిర్వహించడానికి అధికారులకు నిబంధనలు కచ్చితంగా పాటించమని ఆమె ఆదేశించారు.శుక్రవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా చీఫ్ సూపరింటెండెంట్లు, ఎంఈఓలు, డిపార్ట్మెంటల్ అధికారుల ముందు ఈ మార్గదర్శకత్వం ఇచ్చారు. పరీక్ష కేంద్రాల్లో కేంద్ర సిబ్బందితో సహా ఎవరి వద్దా మొబైల్ ఫోన్లు ఉండకూడదని, పరీక్ష ప్రారంభానికి ముందు ప్రతి హాల్‌ను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు.అన్ని కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పర్యవేక్షణ కొనసాగుతున్నట్లు తెలిపారు. ప్రతి పరీక్ష కేంద్రానికి ఫ్లయింగ్ స్క్వాడ్‌లను నియమించి నిరంతరం తనిఖీలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఎలాంటి సంఘటనలు చోటుచేసుకుంటే, సంబంధిత చీఫ్ సూపరింటెంట్, ఎంఈఓలే బాధ్యత వహించాల్సిందిగా స్పష్టం చేశారు.సబ్జెక్ట్ టీచర్లను క్లరికల్ సిబ్బందిగా ఉపయోగించడం నివారించమని, అవసరమైతే వెంటనే ఎస్జీటీ కేడర్ ఉపాధ్యాయులను నియమించాలన్నారు. అకాల వర్షాల నేపథ్యంలో ప్రశ్నాపత్రాలు, ఆన్సర్ షీట్లను సురక్షితంగా క్లోజ్డ్ వాహనాల్లో తరలించాలని సూచించారు.సమీక్షలో జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు, ఎంఈఓలు, చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్మెంటల్ అధికారులు పాల్గొన్నారు.



# తేలేల్మా గ్రామ CSI సంగంలో ఘనంగా ఉపవాస ఆరాధన

సందేశం టైమ్స్, సంగారెడ్డి, మార్చి 21, ప్రతినిధి: బి రమేష్ బాబు
అందోల్ నియోజకవర్గంలోని అందోల్ మండల పరిధిలోని తేలేల్మా గ్రామంలో ఉన్న CSI సంగంలో శుక్రవారం భక్తి భావంతో ఉపవాస ఆరాధన నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో స్థానిక సంఘ సభ్యులతో పాటు పరిసర ప్రాంతాల నుండి వచ్చిన ఇతర సంఘాల విశ్వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంలో స్థానిక గురువులు రెవ. జి. దేవదాస్ ఆరాధకులకు ప్రసంగిస్తూ, దేవుని మహిమను వివరంగా తెలియజెప్పారు. మానవాళికి రక్షణ, కల్యాణం కోసం యేసుక్రీస్తు సిలువపై త్యాగం చేసి చూపిన గొప్ప ప్రేమను ఆయన భక్తులకు స్పష్టంగా వివరించారు. భక్తులు ఆవేశభరితంగా ప్రార్థిస్తూ ఉపవాస ఆరాధనలో పాల్గొని ఆధ్యాత్మిక అనుభూతిని పొందారు.



# మరవెల్లి గ్రామంలో రంజాన్ ఉత్సవం – ముస్లిం సోదరులకు ఈద్ కా తోఫా పంపిణీ


సందేశం టైమ్స్, సంగారెడ్డి, మార్చి 21, ప్రతినిధి: బి రమేష్ బాబు
వట్పల్లి మండలంలోని మరవెల్లి గ్రామంలో రంజాన్ పండుగను పురస్కరించుకుని, ముస్లిం సోదర, సోదరీమణులందరికీ ఈద్ కా తోఫా పంపిణీ చేయడం జరిగింది. గ్రామ సర్పంచ్ చిన్నపట్ల మల్లేశ్వరమ్మగారి ఆధ్వర్యంలో, ఉప సర్పంచ్ మరియు వార్డు సభ్యుల చేతులమీదుగా ఈ కార్యక్రమం నిర్వహించబడింది.గ్రామ సర్పంచ్ చిన్నపట్ల మల్లేశ్వరమ్మా మాట్లాడుతూ, సాంప్రదాయాలను పాటిస్తూ గ్రామంలోని ప్రతి వ్యక్తికి పండుగ సంతోషాన్ని చేరువ చేయడం ప్రధాన లక్ష్యమని, ప్రత్యేకంగా అవసరంలో ఉన్న వారికి సహాయం చేయడం ద్వారా సమాజంలో ఐక్యత, సౌహార్దాన్ని పెంపొందించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానికులు, యువజనులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# వట్పల్లిలో అంబేద్కర్ విగ్రహ పునఃప్రతిష్ఠకు యువజన సంఘాల డిమాండ్

సందేశం టైమ్స్, సంగారెడ్డి, మార్చి 21, ప్రతినిధి: కె. సంగమేశ్వర్
సంగారెడ్డి జిల్లా వట్పల్లి మండల కేంద్రంలో గతంలో తొలగించిన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహాన్ని తిరిగి ప్రతిష్ఠించాలని వట్పల్లి మండల అంబేద్కర్ యువజన సంఘాలు శుక్రవారం (మార్చి 20, 2026) స్థానిక తహశీల్దార్‌కి వినతి పత్రం సమర్పించాయి.యువజన సంఘాల ప్రతినిధులు వినతి పత్రంలో ముఖ్యంగా ఈ డిమాండ్లను ఉంచారు: తొలగించిన విగ్రహాన్ని మండల కేంద్రంలోని అత్యంత రద్దీగా ఉండే ప్రధాన కూడలి (రోడ్డు సెంటర్) లో పునఃప్రతిష్ఠించాలి, విగ్రహ ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని కేటాయించాలి, దానికి అయ్యే ఖర్చు మరియు నిర్మాణ బాధ్యత ప్రభుత్వమే భరించాలి, అలాగే నూతన విగ్రహం అత్యున్నత ప్రమాణాలతో కూడిన కాంస్య విగ్రహంగా ఉండాలి.విగ్రహం ఏర్పాటు అయిన తర్వాత దాని పర్యవేక్షణ మరియు నిర్వహణ బాధ్యతను కూడా ప్రభుత్వం స్వీకరించాలి అని వారు కోరారు. యువజన సంఘాల ప్రతినిధులు, “మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహం లేకపోవడం బాధాకరంగా ఉంది, ప్రభుత్వం వెంటనే స్పందించి గౌరవప్రదమైన రీతిలో కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి” అని చెప్పారు.

# సంగారెడ్డి ప్రజలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు ఎమ్మెల్యే చింత ప్రభాకర్



సందేశం టైమ్స్, సంగారెడ్డి, మార్చి 21, ప్రతినిధి: సంగారెడ్డి టౌన్
సంగారెడ్డి జిల్లా, నియోజకవర్గ ముస్లిం సోదరులు, సోదరీమణులకు పవిత్ర రంజాన్ పండుగ సందర్భంగా ఎమ్మెల్యే చింత ప్రభాకర్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఉపవాస దీక్షలు, ఆధ్యాత్మిక సాధనతో కూడిన రంజాన్ పర్వదినం సమాజంలో శాంతి, సౌహార్దం, సోదరభావాన్ని పెంపొందిస్తుందని ఆయన తెలిపారు.రంజాన్ మాసం మనలో సేవాభావం, పరస్పర సహకారం ను పెంపొందించే పవిత్రమైన కాలమని ఆయన అన్నారు. సమాజంలోని అన్ని వర్గాల ప్రజలు కలిసికట్టుగా పండుగను ఆనందంగా జరుపుకోవాలని, ప్రేమతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.రంజాన్ పర్వదినం ప్రతి ఇంటిలో ఆనందం, ఐశ్వర్యం, ఆరోగ్యాన్ని నింపాలని ఆకాంక్షించిన ఎమ్మెల్యే, సంగారెడ్డి ప్రజలందరికీ మరోసారి శుభాకాంక్షలు తెలిపారు. సమాజంలో ఐక్యత మరింత బలపడాలని ఆయన ఆకాంక్షించారు.

# ఖాజా మియా సేవా గుణం ఆదర్శనీయం




సందేశం టైమ్స్, కోదాడ, మార్చి 21, ప్రతినిధి:కోదాడ మండల విద్యాధికారి సలీం షరీఫ్, ఉపాధ్యాయునిగా అంకితభావంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలను బాధ్యతగా నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. బుధవారం కోదాడ బాలుర ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడు షేక్ ఖాజామీయా ఉగాది, రంజాన్ పండుగల సందర్భంలో పాఠశాలలోని 20 మంది పేద విద్యార్థులకు నూతన వస్త్రాలు బహుకరించారు.ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు. ఖాజామీయా తన సేవా గుణం, బాధ్యతా భావంతో పిల్లల అభివృద్ధి, సంతోషానికి కృషి చేస్తున్నారని అధికారులు అభినందించారు.


# ఇంద్రేశం వార్డు కార్యాలయం ఘనంగా ప్రారంభం



సందేశం టైమ్స్, పటాన్చెరు, మార్చి 21, ప్రతినిధి: బి డేవిడ్
పటాన్చెరు: ఇంద్రేశం మున్సిపాలిటీ పరిధిలోని ఐనోల్ వార్డు కార్యాలయం శుక్రవారం ఘనంగా ప్రారంభించబడింది. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, వార్డు ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.ప్రజలకు మరింత సులభంగా సేవలు అందించడానికి ఈ వార్డు కార్యాలయం ప్రారంభించబడిందని అధికారులు తెలిపారు. పౌరులకు అవసరమైన మున్సిపల్ సేవలు—పుట్టిన మరియు మరణ ధ్రువపత్రాలు, పన్నులు, పింఛన్ సంబంధిత సేవలు మరియు ఇతర సమస్యల పరిష్కారం—ఇకపై దగ్గర్లోనే అందుబాటులో ఉంటాయి.కార్యక్రమంలో పలువురు నాయకులు మాట్లాడుతూ, ఈ కార్యాలయం ప్రజలకు అత్యంత ఉపయోగకరంగా, అభివృద్ధి కార్యక్రమాలు మరింత వేగంగా అమలు అయ్యే విధంగా ఉండాలని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

# మునగాల PHCలో ప్రత్యేక వైద్య నిపుణుల శిబిరం ఘనంగా నిర్వహణ

సందేశం టైమ్స్, మునగాల, మార్చి 21, ప్రతినిధి:ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం లో భాగంగా వైద్య మరియు ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో మునగాల పిహెచ్‌సిలో ప్రత్యేక వైద్య నిపుణుల శిబిరం శుక్రవారం ఘనంగా నిర్వహించబడింది. శిబిరంలో స్త్రీల సంబంధిత, కంటి, ఎముకలు, దంతాలు, చిన్నపిల్లలు మరియు సాధారణ వ్యాధుల నిపుణులు పాల్గొని ప్రజలకు సమగ్ర వైద్య సేవలను అందించారు.జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి డా. పెండెం వెంకట రమణ (MBBS, DCH) స్వయంగా శిబిరాన్ని పర్యవేక్షించి, వైద్య సిబ్బందికి రోగులకు నాణ్యమైన సేవలు అందించాలన్న సూచనలు చేశారు. శిబిరంలో గర్భిణీ స్త్రీల ఆరోగ్య పరీక్షలు, బాలల ఆరోగ్య తనిఖీలు, రక్తపోటు, మధుమేహం వంటి దీర్ఘకాలిక వ్యాధుల స్క్రీనింగ్ నిర్వహించబడింది. అవసరమైతే ఉచిత ఔషధాలు పంపిణీ చేసి, అధిక ప్రమాద గర్భిణీ స్త్రీలను ఉన్నత స్థాయి ఆసుపత్రులకు రిఫర్ చేయడం జరిగింది.అయితే, గ్రామ ప్రజలకు ఆరోగ్య అవగాహన కోసం సమతుల్య ఆహారం, పరిశుభ్రత, వ్యాధుల నివారణ, టీకాలు, కుటుంబ నియంత్రణ పద్ధతులు మరియు ప్రభుత్వ వైద్య సేవల గురించి కూడా వివరించారు. రోగుల నమోదు, పరీక్షలు, ఔషధాల పంపిణీ కోసం ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి, వైద్య సిబ్బంది సమన్వయంతో సేవలు వేగవంతంగా అందించబడ్డాయి.గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవడం వల్ల గ్రామీణ ప్రాంత ప్రజలకు నిపుణుల వైద్య సేవలు చేరువ చేయడంలో శిబిరం కీలక పాత్ర పోషించిందని స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారి డా. జి. ప్రసిద్ధ, వైద్యాధికారులు డా. పుష్పలత, డా. రవీందర్, ఎంపిడిఓ శ్రీ రమేశ్, ఆరోగ్య సిబ్బంది, ఆశా వర్కర్లు, ANMs, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.
తదుపరి ప్రత్యేక వైద్య నిపుణుల శిబిరాలు: క్రమ సంఖ్య,తేదీ,క్యాంపు జరుగు పిహెచ్సి 1)23-03-26 నాగారం 2)24-03-26నేరేడుచెర్ల 3) 25-03-26 నూతన్ కల్
,పై తేదీలలో నిర్వహింపబడే శిబిరాలకు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని, తమ రుగ్మతలకు చికిత్స పొందవచ్చు.



# ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ వేడుకల్లో పాల్గొన్న కొప్పుల శేషారెడ్డి

సందేశం టైమ్స్, సంగారెడ్డి, మార్చి 21, అందోల్ టౌన్ ప్రతినిధి బి రమేష్ బాబు: అందోల్ నియోజకవర్గం అల్లాదుర్గ్ మండలం సీతనగర్ తండాలో పల్తియ సునిత, శకూరు నాయక్ నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ వేడుకలు ఘనంగా నిర్వహించగా, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అల్లాదుర్గ్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొప్పుల శేషారెడ్డి హాజరై తన చేతుల మీదుగా ప్రారంభోత్సవం నిర్వహించారు. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆధ్వర్యంలో ప్రతి పేదవానికి సొంత ఇల్లు కల నెరవేర్చాలనే లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం "ఇందిరమ్మ ఇళ్లు" పథకాన్ని ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్నదని తెలిపారు. ప్రతి కుటుంబానికి ఆత్మగౌరవంతో కూడిన నివాసం కల్పించడమే ప్రభుత్వ సంకల్పమని, ఇందిరా గాంధీ ప్రారంభించిన పేదల గృహనిర్మాణ స్ఫూర్తితో అర్హులైన వారికి ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం రూ.5 లక్షల ఆర్థిక సాయం అందిస్తున్నదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్, గ్రామ పార్టీ అధ్యక్షుడు బేతయ్య, రాజు, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

# ధన్వార్‌లో జీఎంఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రంజాన్ తోఫా పంపిణీ



సందేశం టైమ్స్, సంగారెడ్డి, మార్చి 21, నారాయణఖేడ్ ప్రతినిధి: నారాయణఖేడ్ నియోజకవర్గం మనూర్ మండలం ధన్వార్ గ్రామంలో నిరుపేద ముస్లిం కుటుంబాలకు జీఎంఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రంజాన్ తోఫా పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. జీఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు గుజ్జిపు మచ్చేందర్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ అమృత్, ఉప సర్పంచ్ కాశీనాథ్ పటేల్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కిషన్‌రావు పటేల్, వార్డ్ సభ్యులు రాములు, వెంకట్రావు పటేల్, నారాయణఖేడ్ మున్సిపల్ నాలుగవ వార్డు బీఆర్ఎస్ అధ్యక్షుడు శ్రీకాంత్, ఫౌండేషన్ ప్రతినిధులు హర్షవర్ధన్ రెడ్డి, శ్రీనివాస్, అభి పవర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే యువ నాయకులు పవన్ కుమార్, మొగులయ్య, రత్నయ్య, మోహన్, సంజీవులు, పాపయ్య, యాదుళ్ళ, నవీన్, శ్యామయ్య, విట్టల్, మాణిక్యం, జైపాల్ తదితరులు కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.




# అల్లాదుర్గ్‌లో మైనార్టీలకు ఈద్ కానుకల పంపిణీ

సందేశం టైమ్స్, సంగారెడ్డి, మార్చి 21, అందోల్ టౌన్ ప్రతినిధి బి రమేష్ బాబు: అందోల్ నియోజకవర్గం అల్లాదుర్గ్ మండల కేంద్రంలోని మహిళా సమైక్య భవనంలో రంజాన్ పండుగ సందర్భంగా ముస్లిం సోదర సోదరీమణులకు "ఈద్ కా తోఫా" పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశాల మేరకు వట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల లక్ష్మి శేషారెడ్డి, అల్లాదుర్గ్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొప్పుల శేషారెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా తహసీల్దార్ మల్లయ్య, సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు సుభాష్ రావు, భాస్కర్, ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు బలరాం, ప్రధాన కార్యదర్శి బాలకిషన్, ఉపాధ్యక్షుడు సాయిబాబా, బీసీ సెల్ మండల అధ్యక్షుడు నర్సింలు, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కురుమ మహేష్, సోషల్ మీడియా ప్రతినిధి జైపాల్, సర్పంచులు శశి రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, హరి, శంకర్ నాయక్, వీరన్న, మన్న నాయక్, గోపాల్ రెడ్డి, ఉప సర్పంచ్ పండు, కృష్ణ, సీనియర్ నాయకులు విట్టల్, బుమరెడ్డి, శేఖర్ పటేల్, నర్సింలు, ప్రభు, బేతయ్య, సాయిలు, శ్రీనివాస్, శ్రీశైలం, విట్టల్ రెడ్డి, బాల్‌రాజ్, పాపయ్య, రోషన్, శ్రీను తదితరులు పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# గచ్చిబౌలి స్టేడియంలో స్పోర్ట్స్ హ్యాకథాన్ పోస్టర్ ఆవిష్కరణ




సందేశం టైమ్స్, సంగారెడ్డి, మార్చి 21, ప్రతినిధి: హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో మార్చి 28, 29 తేదీల్లో జరగనున్న స్పోర్ట్స్ హ్యాకథాన్ (క్రీడలలో ఆవిష్కరణలు మరియు పరిష్కారాలు) కార్యక్రమాన్ని పురస్కరించుకుని ఈ రోజు జిల్లా క్రీడా శాఖ అధికారి అఖిలేష్ రెడ్డి చేతుల మీదుగా పోస్టర్ ఆవిష్కరణతో పాటు కగడను వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. జిల్లాలోని క్రీడాకారులందరూ పెద్ద ఎత్తున పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అసోసియేషన్ సంగారెడ్డి జిల్లా కార్యదర్శి ఉషయ్య (కిరణ్ జాన్), సీనియర్ అసిస్టెంట్ అభినయ్, అలాగే టిటా ప్రతినిధులు అభిలాష్, హరికృష్ణ, వివేక్, భాస్కర్, ఏకాంశ్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ బడ్జెట్ 2026-27 రూ.3,24,234 కోట్లుగా ప్రవేశపెట్టారు

సందేశం టైమ్స్, హైదరాబాద్, మార్చి 21, ప్రతినిధి: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 2026-27 ఆర్థిక సంవత్సరానికి రూ.3,24,234 కోట్ల భారీ బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. ఇందులో రాబడి వ్యయం రూ.2,34,406 కోట్లు, మూలధన వ్యయం రూ.47,267 కోట్లుగా కేటాయించారు. పంచాయతీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధికి రూ.33,688 కోట్లు, వ్యవసాయానికి రూ.23,179 కోట్లు, నీటిపారుదలకు రూ.22,615 కోట్లు, విద్యకు రూ.26,674 కోట్లు, విద్యుత్ శాఖకు రూ.21,285 కోట్లు, పురపాలక పరిపాలనకు రూ.17,907 కోట్లు, వైద్య ఆరోగ్యానికి రూ.13,679 కోట్లు, రవాణా, రోడ్లు మరియు భవనాలకు రూ.12,789 కోట్లు కేటాయించారు. సామాజిక సంక్షేమంలో భాగంగా ఎస్సీ సంక్షేమానికి రూ.11,784 కోట్లు, ఎస్టీ సంక్షేమానికి రూ.7,937 కోట్లు, బీసీ సంక్షేమానికి రూ.3,769 కోట్లు, మైనారిటీల సంక్షేమానికి రూ.3,769 కోట్లు కేటాయించారు. గృహ నిర్మాణానికి రూ.7,430 కోట్లు, పౌర సరఫరాలకు రూ.7,366 కోట్లు, మహిళా మరియు శిశు సంక్షేమానికి రూ.3,143 కోట్లు, పరిశ్రమలకు రూ.3,490 కోట్లు, ఐటీ రంగానికి రూ.875 కోట్లు, పర్యాటకానికి రూ.1,224 కోట్లు, పశుసంవర్ధక మరియు మత్స్య పరిశ్రమకు రూ.1,529 కోట్లు, కార్మిక సంక్షేమానికి రూ.998 కోట్లు కేటాయించారు. యువత అభివృద్ధి కోసం రాజీవ్ యువ వికాసానికి రూ.6,000 కోట్లు కేటాయించడం ప్రత్యేకంగా నిలిచింది.

# రంజాన్ చివరి శుక్రవారం సందర్భంగా నేరడలో ఘనంగా ఇఫ్తార్ కార్యక్రమం



సందేశం టైమ్స్, చింతకాని, మార్చి 21, ప్రతినిధి: చింతకాని మండలం నేరడ గ్రామంలో పవిత్ర రంజాన్ మాసంలోని చివరి శుక్రవారం సందర్భంగా మసీదులో ముస్లిం సోదరులతో కలిసి ఇఫ్తార్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దూసరి నేతాజీ, సిపిఐ మండల కార్యదర్శి దూసరి గోపాలరావు, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు మంకెన నాగేశ్వరరావు, సిపిఐ గ్రామ కార్యదర్శి షేక్ దస్తగిరి తదితరులు పాల్గొన్నారు. పాల్గొన్న నాయకులు ముస్లిం సోదరులతో కలిసి ఉపవాస విరమణ చేసి రంజాన్ మాసం సందేశాలను పంచుకుంటూ సామరస్యానికి ప్రాధాన్యతనిచ్చారు.

# రాఘవపురంలో సిపిఐ గ్రామ శాఖ సమావేశం



సందేశం టైమ్స్, చింతకాని, మార్చి 21, ప్రతినిధి: చింతకాని మండలం రాఘవపురం గ్రామంలో సిపిఐ గ్రామ శాఖ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి పాల్గొని పార్టీ బలోపేతం, ప్రజా సమస్యలపై పోరాటం అవసరాన్ని వివరించారు. కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి దూసరి గోపాలరావు, మండల సహాయ కార్యదర్శి అబ్బూరి మహేష్, రైతు సంఘం మండల అధ్యక్షుడు దొబ్బల వెంగళరావు, బికేఎంయు మండల నాయకుడు అమరయ్య, గ్రామ శాఖ కార్యదర్శి కొల్లి రవి, కొల్లి గోవిందరావు, చల్లమల కృష్ణ, చల్లమల అనిల్, కాంపల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.



# చింతకానిలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం

సందేశం టైమ్స్, చింతకాని, మార్చి 21, ప్రతినిధి: చింతకాని PACS కార్యాలయంలో కార్యదర్శి శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో మత్కేపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అంబటి వెంకటేశ్వరరావు, చింతకాని సర్పంచ్ కిలారు మనోహర్ బాబు ముఖ్య అతిథులుగా పాల్గొని మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు పండించిన మొక్కజొన్నను బాగా ఎండబెట్టి తేమ శాతం నియమాలకు అనుగుణంగా తీసుకురావాలని సూచించారు. ప్రభుత్వం రైతులకు సరైన మద్దతు ధర అందించేందుకు కట్టుబడి ఉందని తెలిపారు. రైతులు తమ పంటను నేరుగా కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి విక్రయించడం ద్వారా గిట్టుబాటు ధర పొందవచ్చని పేర్కొన్నారు. కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా సాగుతుందని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. రైతులు సమస్యలు ఎదుర్కొంటే వెంటనే అధికారులకు తెలియజేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం కృషి చేస్తోందని, మధ్య దళారులకు అవకాశం లేకుండా మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు కేంద్రాల ఏర్పాటు ప్రభుత్వం దూరదృష్టికి నిదర్శనమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నాయకత్వంలో రైతుల కోసం పలు సంక్షేమ కార్యక్రమాలు అమలవుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ జిల్లా డైరెక్టర్ కొప్పుల గోవిందరావు, మత్కేపల్లి AMC డైరెక్టర్ ఎస్.కె. కాసిం, మండల వ్యవసాయ అధికారి మానస, ఆర్ఐ జగదీష్, నాయకులు మడుపల్లి భాస్కర్, రైతు సంఘం నాయకులు కోలేటి నాగేశ్వరరావు బృందం, దేవాలయ కమిటీ చైర్మన్ ఎడ్లపల్లి శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్‌లు మరియు పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

# రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన కౌన్సిలర్ పట్లూరి శివశేఖర్



సందేశం టైమ్స్, అందోలు-జోగిపేట, మార్చి 21, ప్రతినిధి: అందోలు-జోగిపేట మున్సిపాలిటీ పరిధిలోని ముస్లిం సోదర సోదరీమణులందరికీ మున్సిపల్ 13వ వార్డు కౌన్సిలర్ పట్లూరి శివశేఖర్ రంజాన్ పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. ఉపవాసం, ప్రార్థనలు, దానం ద్వారా ఆత్మశుద్ధి సాధించే ఈ పవిత్ర మాసం అందరికీ శాంతి, సౌఖ్యాలు తీసుకురావాలని ఆకాంక్షించారు. రంజాన్ పర్వదినం సహనం, సేవాభావం, సహజీవన విలువలను పెంపొందిస్తుందని, పేదల పట్ల కరుణ చూపుతూ అవసరంలో ఉన్నవారికి సహాయం చేయడం ఈ మాసపు ప్రధాన సందేశమని పేర్కొన్నారు. ప్రతి ఇంటా ఆనందం, ఆరోగ్యం, ఐశ్వర్యం నిండాలని, అల్లాహ్ కరుణతో సమాజంలో శాంతి, సుఖసంతోషాలు నెలకొనాలని ఆకాంక్షించారు. పరస్పర గౌరవంతో సమాజం ముందుకు సాగాలని కోరుతూ మరోసారి ముస్లీం సోదరులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

# వట్‌పల్లిలో రూ.10 లక్షల సీసీ రోడ్డు పనులకు శ్రీకారం



సందేశం టైమ్స్, వట్‌పల్లి, మార్చి 21, ప్రతినిధి: రాష్ట్ర మంత్రివర్యులు దామోదర్ రాజనర్సింహ ఆదేశాల మేరకు సర్పంచ్ రవీందర్ ఆధ్వర్యంలో వట్‌పల్లి గ్రామంలోని రేణుక ఎల్లమ్మ దేవాలయం సమీపంలో రూ.10 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు పనులకు శ్రీకారం చుట్టారు. గ్రామ అభివృద్ధిలో భాగంగా చేపట్టిన ఈ పనులు ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందించనున్నట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ అహమ్మద్ హుసేన్, వార్డు సభ్యుడు బగ్గీ ఇస్మాయిల్, నర్సింహా గౌడ్, యాదయ్య, గౌడ సంగం నాయకులు, గ్రామ సీనియర్ నాయకులు, యువ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రవ్యాప్తంగా "అరైవ్-అలైవ్" కార్యక్రమం రోడ్డు ప్రమాదాల నివారణకు కఠిన చర్యలు



సందేశం టైమ్స్, హైదరాబాద్, మార్చి 21, ప్రతినిధి: ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా "అరైవ్-అలైవ్" కార్యక్రమంపై డా. బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర రోడ్లు భవనాలు శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో టి ఆర్ అండ్ బి స్పెషల్ సీఎస్ వికాస్ రాజ్, ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ ఇలాంబర్తి, డీజీపీ శివదర్ రెడ్డి, ఆర్ అండ్ బి ఈఎన్‌సీలు మోహన్ నాయక్, జయభారతి తదితర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి సామూహిక బాధ్యత అని, దేశంలో అనారోగ్యంతో కన్నా రోడ్డు ప్రమాదాల్లో మరణాలు ఎక్కువగా జరుగుతున్నాయని తెలిపారు. 2025లో దేశవ్యాప్తంగా 4.5 లక్షల ప్రమాదాలు జరిగి 1.6 లక్షల మంది మృతి చెందగా, తెలంగాణలో 22,441 ప్రమాదాల్లో 6,221 మంది ప్రాణాలు కోల్పోయారని పేర్కొన్నారు. ముఖ్యంగా 18 నుంచి 40 ఏళ్ల మధ్య వయస్సు వారే ఎక్కువగా ప్రమాదాలకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. హెవీ వెహికల్స్ డ్రైవర్ల నిర్లక్ష్యం, డ్రంక్ అండ్ డ్రైవ్, సెల్‌ఫోన్ వినియోగం, ఓవర్‌లోడింగ్ వంటి కారణాల వల్ల ప్రమాదాలు పెరుగుతున్నాయని తెలిపారు. హెల్మెట్ వినియోగం, బ్లాక్ స్పాట్ల గుర్తింపు, ట్రాఫిక్ నియమాలపై అవగాహన పెంపుతో 70 శాతం ప్రమాదాలు తగ్గించవచ్చన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో రోడ్ సేఫ్టీ కమిటీలు ఏర్పాటు చేసి నెలనెలా సమావేశాలు నిర్వహించాలని, 100 శాతం హెల్మెట్ వినియోగం, జీరో యాక్సిడెంట్ గ్రామాల లక్ష్యంగా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. డ్రైవర్స్‌కు ఐ చెకప్‌లు, స్కూల్ బస్సు డ్రైవర్లకు డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు, మైనర్ డ్రైవింగ్‌పై కఠిన చర్యలు అవసరమన్నారు. విద్యార్థులకు ట్రాఫిక్ అవగాహన, డిజిటల్ ప్రచారం, అవార్డుల ద్వారా ప్రోత్సాహం ఇవ్వాలని పేర్కొన్నారు. ఏప్రిల్ 13 నుంచి 18 వరకు రాష్ట్రవ్యాప్తంగా "అరైవ్-అలైవ్" కార్యక్రమం నిర్వహించనున్నట్లు అధికారులు వెల్లడించారు.



# చలాన్లపై కఠిన నిబంధనలు... ఐదుకిపైగా చలాన్లు ఉంటే లైసెన్స్, ఆర్సీ సీజ్‌కు సిద్ధం

సందేశం టైమ్స్, హైదరాబాద్, మార్చి 21, ప్రతినిధి: రాష్ట్రంలో ట్రాఫిక్ చలాన్లపై కఠిన నిబంధనలు అమలు చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఏడాదిలో ఐదుకిపైగా చలాన్లు ఉన్న వాహనదారుల లైసెన్స్ లేదా ఆర్సీ సీజ్ చేసే దిశగా త్వరలో నోటిఫికేషన్ విడుదల కానుందని సమాచారం. చలాన్ జారీ అయిన 45 రోజుల్లో వాహనదారులు తమ అభ్యంతరాలను తెలియజేసేందుకు గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేయాలని పోలీస్ యంత్రాంగం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఫిర్యాదును పరిశీలించిన తర్వాత అధికారులు తీసుకున్న నిర్ణయానికి అంగీకరిస్తే 30 రోజుల్లో చలాన్ చెల్లించాల్సి ఉంటుంది, లేకపోతే 50 శాతం చలాన్ చెల్లించి కోర్టును ఆశ్రయించవచ్చు. కోర్టుకు వెళ్లనట్లయితే అదనంగా 15 రోజుల గడువు ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. ఫిర్యాదు పరిష్కారం అయినా చలాన్ చెల్లించకపోతే లైసెన్స్, ఆర్సీ సీజ్ చేయడంతో పాటు వాహనానికి సంబంధించిన అన్ని ఆర్టీఏ సేవలను డీ-యాక్టివేట్ చేసి, చలాన్ చెల్లించిన తర్వాతే తిరిగి యాక్టివేట్ చేసే విధంగా నిబంధనలు అమలు చేసేందుకు పోలీస్ శాఖ చర్యలు చేపడుతోంది.

# ఎస్ఎల్‌బీసీ ఇన్లెట్ తవ్వకాల పునరుద్ధరణ ప్రారంభం

సందేశం టైమ్స్, హైదరాబాద్, మార్చి 21, ప్రతినిధి: ప్రతిష్ఠాత్మక ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్ట్‌లో ఇన్లెట్ తవ్వకాల పునరుద్ధరణ పనులు ప్రారంభమైనట్లు రాష్ట్ర నీటి పారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఇప్పటికే దేవరకొండ వైపు ఔట్‌లెట్ పనులు ప్రారంభమైన నేపథ్యంలో ఇప్పుడు ఇన్లెట్ పనులు కూడా ప్రారంభం కావడంతో తవ్వకాలు వేగవంతమయ్యాయని పేర్కొన్నారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో ఎస్ఎల్‌బీసీతో పాటు డిండి ఎత్తిపోతల పథకం, అచ్చంపేట బ్రాంచ్ కాలువ పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రెండు వైపులా తవ్వకాలు కొనసాగుతున్నందున ఇకపై పనులు నిరంతరాయంగా సాగుతాయని తెలిపారు. ప్రపంచంలోనే అత్యంత పొడవైన సొరంగ మార్గంగా నిలవనున్న ఈ ప్రాజెక్ట్‌లో భద్రతా ప్రమాణాలను కట్టుదిట్టంగా పాటించాలని అధికారులకు ఆదేశించారు. సొరంగ మార్గంలో గాలి, వెలుతురు సరఫరా ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలని సూచించారు. ఇన్లెట్ వైపు పనులు పునఃప్రారంభానికి ముందు అదనపు భద్రతా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. గతంలో నిలిచిపోయిన ఔట్‌లెట్ తవ్వకాలు కూడా ఆధునిక సాంకేతికతతో పునఃప్రారంభమై పురోగమిస్తున్నాయని చెప్పారు. మొత్తం 43.93 కిలోమీటర్ల పొడవైన ఈ సొరంగ మార్గం పూర్తైతే ప్రపంచంలోనే అత్యంత పొడవైన ప్రాజెక్టుగా నిలుస్తుందని పేర్కొన్నారు. గతంలో జరిగిన ఘటనల నేపథ్యంలో పనులు నిలిచిపోయినా, ప్రభుత్వం ప్రత్యేక కమిటీ సూచనల మేరకు పునరుద్ధరణ చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

# రేలమడుగు గ్రామంలో అభివృద్ధి జోరు... మౌలిక సదుపాయాల మెరుగుదల



సందేశం టైమ్స్, నిజాంపేట్ మండలం, మార్చి 21, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గం పరిధిలోని రేలమడుగు గ్రామంలో నూతన సర్పంచ్ దొంతి సాయిలు ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయి. గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారానికి రెండు కొత్త బోర్లు ఏర్పాటు చేయడంతో పాటు ఐమాక్స్ లైట్లు, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేసి గ్రామంలో వెలుగు నింపారు. మురికి తొలగింపు కార్యక్రమాలు చేపట్టి, మురికికాలువల్లో దోమల నివారణకు మందులు పిచికారీ చేయడంతో పాటు దుర్వాసన నివారణకు చర్యలు చేపట్టారు. దశలవారీగా అన్ని వార్డుల్లో సీసీ రోడ్లు, మురికికాలువలు, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేస్తామని సర్పంచ్ తెలిపారు. ఎంపీ, ఎమ్మెల్యేల సహకారంతో గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని ఆయన స్పష్టం చేశారు.

# భద్రాచలం దేవస్థాన అభివృద్ధికి మాస్టర్ ప్లాన్


సందేశం టైమ్స్, హైదరాబాద్, మార్చి 21, ప్రతినిధి: తెలంగాణలోని ప్రముఖ పుణ్యక్షేత్రం భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థాన అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అత్యున్నత ప్రాధాన్యత ఇస్తోందని మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కొండా సురేఖ, తుమ్మల నాగేశ్వరరావు, వాకాటి శ్రీహరి తెలిపారు. సచివాలయంలో మంత్రి కొండా సురేఖ కార్యాలయంలో జరిగిన సమావేశంలో భద్రాచలం ఆలయ అభివృద్ధికి రూపొందించిన మాస్టర్ ప్లాన్‌పై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ ఆగమ శాస్త్రం ప్రకారం భక్తుల మనోభావాలకు అనుగుణంగా మూడు దశల్లో అభివృద్ధి పనులు చేపట్టాలని నిర్ణయించినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో చర్చించిన అనంతరం మాస్టర్ ప్లాన్‌కు తుదిరూపు ఇవ్వనున్నట్లు వెల్లడించారు. వచ్చే ఏడాది గోదావరి పుష్కరాల నాటికి పుష్కర ఘాట్‌తో పాటు తొలి దశ పనులు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. భద్రాచలాన్ని అంతర్జాతీయ స్థాయి ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో రామవరం వద్ద ట్రైబల్ మ్యూజియం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అలాగే కొరివి వీరభద్రస్వామి, మల్లూరు నరసింహస్వామి దేవాలయాల అభివృద్ధికి కూడా ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. సమావేశంలో పార్లమెంట్ సభ్యుడు బలరాం నాయక్, ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు తదితరులు పాల్గొన్నారు

# గచ్చిబౌలి స్టేడియంలో స్పోర్ట్స్ హ్యాకథాన్‌కు సన్నాహాలు




సందేశం టైమ్స్, సంగారెడ్డి, మార్చి 21, ప్రతినిధి: హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో ఈ నెల 28, 29 తేదీలలో నిర్వహించనున్న స్పోర్ట్స్ హ్యాకథాన్ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. జిల్లా క్రీడాశాఖ అధికారి అఖిలేష్ రెడ్డి పోస్టర్‌ను ఆవిష్కరించి, కాగడను వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని క్రీడాకారులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అసోసియేషన్ సంగారెడ్డి జిల్లా కార్యదర్శి ఉషయ్య (కిరణ్ జాన్), సీనియర్ అసిస్టెంట్ అభినయ్, టిటా ప్రతినిధులు అభిలాష్, హరి కృష్ణ, వివేక్, భాస్కర్, ఏకాంశ్ తదితరులు పాల్గొన్నారు.

# సంగారెడ్డిలో డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ పైలెట్ ప్రారంభం... సిబ్బందికి శిక్షణ



సందేశం టైమ్స్, సంగారెడ్డి, మార్చి 21, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లాలో డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ పైలెట్ ప్రాజెక్ట్ అమలుకు కీలక అడుగు పడగా సంబంధిత సిబ్బందికి శిక్షణ కార్యక్రమం జిల్లా మెడికల్ కళాశాల కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ సంగారెడ్డి డివిజన్‌లో జీజీహెచ్, జోగిపేట్, పటాన్చెరు ఏరియా ఆసుపత్రులు, సదాశివపేట సీహెచ్సీతో పాటు 15 పీహెచ్సీలలో సోమవారం నుంచి ప్రాజెక్ట్ అమలుకు అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. రోగుల వైద్య చరిత్రను ఓపీ నుంచి చికిత్స పూర్తయ్యే వరకు అన్ని విభాగాల్లో డిజిటల్ రూపంలో నమోదు చేయాలని, సిబ్బంది తమ సిస్టమ్స్, మొబైల్ ఫోన్లలో అవసరమైన సాఫ్ట్‌వేర్ తాజా వెర్షన్‌లో ఉందో లేదో పరిశీలించాలని సూచించారు. లాగిన్ సదుపాయాలు, ఇంటర్నెట్ సౌకర్యం కల్పించి రోగులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సేవలు అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఎంఅండ్‌హెచ్‌ఓ వసంతరావు, జీజీహెచ్ సూపరింటెండెంట్ మురళీకృష్ణ, డాక్టర్ శశాంక్, స్పెషలిస్ట్ డాక్టర్లు, మెడికల్ ఆఫీసర్లు, డాటా ఎంట్రీ ఆపరేటర్లు, టెక్నికల్ సిబ్బంది పాల్గొన్నారు.

## బండల మిర్జాపూర్‌లో సేవా ధర్మంతో నిలిచిన జయమ్మ మాతాజీ



సందేశం టైమ్స్, జహీరాబాద్, మార్చి 21, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పరిధిలోని బండల మిర్జాపూర్ గ్రామంలో జయమ్మ మాతాజీ సేవా ధర్మంతో ప్రజల మన్ననలు పొందుతున్నారు. శత్రువుని కూడా మిత్రుడిగా మార్చే గుణం కలిగిన ఆమె, సేవనే మనిషి ప్రాథమిక లక్షణంగా భావిస్తూ భగవంతుని కృపతో ప్రజలకు అండగా నిలుస్తున్నారు. ఎవరికి ఏ సమస్య వచ్చినా ముక్కుసూటిగా పరిష్కారం చూపే వ్యక్తిత్వం ఆమెది. గ్రామంలో ఎప్పుడైనా అందుబాటులో ఉంటూ, తనను ఆశ్రయించే వారికి తక్షణ సహాయం అందిస్తూ విశ్వాసాన్ని సంపాదించుకున్నారు. బలహీనంగా, నిస్సహాయంగా ఉన్న వారికి సేవ చేయడం తన ధర్మమని భావించే జయమ్మ మాతాజీని స్థానికులు తల్లిగా భావిస్తూ గౌరవిస్తున్నారు.

# బీసీ సబ్ ప్లాన్ చట్టం తీసుకురావాలి – తక్కువ కేటాయింపులపై ఆవేదన



బీసీ సబ్ ప్లాన్ చట్టం తీసుకురావాలి – తక్కువ కేటాయింపులపై ఆవేదన

సందేశం టైమ్స్, సంగారెడ్డి, మార్చి 21, ప్రతినిధి: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2026-27 బడ్జెట్‌లో బీసీలకు కేటాయింపులు తక్కువగా ఉండటంపై చేతివృత్తిదారుల సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ ఎస్. రమేష్ గౌడ్ ఆందోళన వ్యక్తం చేశారు. మొత్తం రూ.3,24,234 కోట్ల బడ్జెట్‌లో బీసీలకు కేవలం రూ.12,511 కోట్లు మాత్రమే కేటాయించడంతో హాస్టళ్లు, విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు, వృత్తిదారుల సంక్షేమం ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. రాష్ట్రంలో సుమారు 25 లక్షల మంది చేతివృత్తులపై ఆధారపడి జీవిస్తున్నారని, వారి ఉపాధి, ఆధునికీకరణ కోసం ఉన్న కార్పొరేషన్లు, ఫెడరేషన్లు తగిన నిధుల లేమితో నిర్వీర్యమవుతున్నాయని పేర్కొన్నారు. 2025-26 బడ్జెట్‌లో రూ.1,418 కోట్లు కేటాయించినప్పటికీ ఇప్పటివరకు ఖర్చు చేయలేదని, ఆర్థిక సంవత్సరం ముగియకముందే నిధులు వినియోగించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల హామీల అమలుకు 2026-27 బడ్జెట్‌లో వృత్తిదారుల సంక్షేమానికి కనీసం రూ.25 వేల కోట్లు కేటాయించాలని, తక్షణమే బీసీ సబ్ ప్లాన్ చట్టం తీసుకువచ్చి బీసీల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

# మద్వార్ గ్రామంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి



సందేశం టైమ్స్, నారాయణఖేడ్, మార్చి 21, ప్రతినిధి: నారాయణఖేడ్ నియోజకవర్గ పరిధిలోని మద్వార్ గ్రామంలో నూతన సీసీ రోడ్డు మరియు పాఠశాల కాంపౌండ్ వాల్ నిర్మాణానికి ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు తాగునీటి సౌకర్యం కోసం ఏర్పాటు చేసిన నూతన బోరును కూడా ప్రారంభించారు. గ్రామ అభివృద్ధి దిశగా చేపడుతున్న ఈ పనులు ప్రజలకు ఉపయోగకరంగా నిలుస్తాయని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## యువకుడు మల్లేష్ ఆకస్మిక మృతి... రాయికోడ్ మండలం శోకసంద్రం



సందేశం టైమ్స్, రాయికోడ్, మార్చి 21, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండలం రాయికోడ్ గ్రామానికి చెందిన బాలమొల్ల మల్లేష్ గుండెపోటుతో మరణించడంతో మండలం మొత్తం విషాదంలో మునిగిపోయింది. అందరితో చిరునవ్వుతో పలకరించే మంచి మనసున్న యువకుడిని కోల్పోవడంతో గ్రామ ప్రజలు ఆయన జ్ఞాపకాలను తలుచుకుంటూ కన్నీరు మున్నీరవుతున్నారు. మల్లేష్ మృతికి సంతాపంగా మండలంలోని ప్రజలు సోషల్ మీడియా ద్వారా "ఓం శాంతి మల్లేష్" అంటూ నివాళులు అర్పించారు. ఆయన కుటుంబానికి ఆత్మస్థైర్యం కలగాలని దేవుడిని ప్రార్థిస్తూ గ్రామ ప్రజలు, పరిసర గ్రామాల వారు తమ మద్దతు తెలియజేశారు. మల్లేష్ అంత్యక్రియలు రేపు మధ్యాహ్నం 2 గంటలకు ఆయన స్వగ్రామంలో నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

# ధూప దీప నైవేద్య అర్చక సంఘం రాష్ట్ర అధ్యక్ష, కోశాధికారి నియామకం



సందేశం టైమ్స్, ఖమ్మం, మార్చి 21, ప్రతినిధి: ఉగాది పండుగను పురస్కరించుకొని తెలంగాణ రాష్ట్ర ధూప దీప నైవేద్య అర్చక సంఘం ఆధ్వర్యంలో జరిగిన కీలక సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు, కోశాధికారి నియామకాలను ప్రకటించారు. సంఘం ప్రధాన కార్యదర్శులు అన్నావజ్జల ప్రసాద్ శర్మ, సంయుక్త కార్యదర్శి తిరునగరి వెంకటాద్రి స్వామి, కార్యవర్గ సభ్యులు పాల్గొన్న ఈ సమావేశంలో ఇటీవల వాసుదేవ శర్మ రాజీనామా చేయడంతో పాటు నందన హరికిషన్ శర్మ ఆదాయ వ్యయాలలో పారదర్శకత పాటించలేదని ఆరోపణల నేపథ్యంలో వారి స్థానాల్లో కొత్త నియామకాలు చేపట్టారు. జనగామ జిల్లా కొడకండ్ల గ్రామానికి చెందిన పిండిప్రోలు నాగ దక్షిణామూర్తిని రాష్ట్ర సంఘం అధ్యక్షుడిగా, మహబూబ్‌నగర్ జిల్లా అన్వాడ మండలం ఇబ్రహీంబాద్‌కు చెందిన గాండ్ల రవికుమార్‌ను రాష్ట్ర కోశాధికారిగా నియమిస్తూ నిర్ణయం ప్రకటించారు

పత్రిక పేరు : సందేశం టైమ్స్ (Sandesham Times) – రిజిస్ట్రేషన్ నం :TGTEL/25/A0348, టైటిల్ కోడ్: Sandhesham Times, ప్రచురణ స్థలం: 3-82, వాయిల సింగారం గ్రామం, అనంతగిరి మండలం, సూర్యాపేట జిల్లా, తెలంగాణ – 508206, ప్రచురణకర్త / publisher : కాసే అమృత, మొబైల్: 9052045435, ఈ-మెయిల్: sandeshamtimes@gmail.com, వెబ్‌సైట్: www.sandeshamtimes.com, ముద్రణ స్థలం: సండే ప్రింటింగ్ ప్రెస్ (Sunday Printing Press), 3-4297, సరస్వతి కాంప్లెక్స్, SVN కాలనీ, గుంటూరు, ఆంధ్రప్రదేశ్ – 522006.